TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక :20 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ గురువారం.14.08.2025 పేజీలు : 8, వెల:రూ.2.00




## ముంచెత్తిన వాన.... నీట మునిగిన పంటలు

అమృత్ తెలంగాణ: వరంగల్‌లో ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యేలు, అధికారులు రాష్ట్రంలో వర్షాలు దంచికొట్టాయి. ప్రభుత్వం ముందస్తుగా తీసుకున్న చర్యల వల్ల ఎక్కడా ప్రాణనష్టం జరగలేదు. వర్షాల ప్రభావంపై స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి అధికారయంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన విషయం తెలిసిందే. ఆదిలాబాద్‌లో భారీ వర్షాలు కురిశాయి. రామగుండంలో బుధవారం అత్యధికంగా 76.8 మి.మీ., వర్షపాతం నమోదైంది. నల్గొండలో 28.2 మి.మీ., ఆదిలాబాద్‌లో 27.8 మి.మీ., వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ నిండుకుండల్లా మారాయి. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ ఫుల్ ట్యాంక్ లెవల్‌ను మించి ప్రవహిస్తోంది. దీనితో నీటిని కిందికి వదిలేస్తున్నారు. నాగార్జునసాగర్‌లో అన్ని గేట్లు ఎత్తేశారు. హిమాయత్‌సాగర్‌లో నాలుగు గేట్లను మూడు అడుగుల ఎత్తు వరకు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం యావత్తూ అప్రమత్తంగా ఉండి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లాల్లో పాఠశాలలకు బుధ, గురు వారాల్లో సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో ఉదయం పూట మాత్రమే హాఫ్ డే స్కూళ్లను నడిపారు. హైదరాబాద్ సిటీలో 7 నుంచి 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మేడ్చల్, పటాన్‌చెరు, మియాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి ప్రాంతాల్లో 15 సెం.మీ.,వర్షపాతం నమోదైనట్టు హైడ్రా అధికారులు తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోమ్ ఇవ్వాలని సైబరాబాద్ పోలీసులు ఆయా కంపెనీలకు సమాచారం ఇచ్చారు. దీనితో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పాయి. అయినా పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడ్డాయి. భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, మెదక్, ములుగు, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం కూడా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఆ కేంద్రం హెచ్చరించింది. రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో రాష్ట్ర ప్రభుత్వం అలర్ట్ ప్రకటించింది. అధికారులు అప్రమత్తమై ముంపు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను సరక్షిత ప్రాంతాలకు తరలించారు. మంచిర్యాల, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్, ములుగు, భూపాలపల్లి తదితర జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసాయి. వరి పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లు, కాల్వర్టులు కోతకు గురయ్యాయి. గిరిజన ప్రాంతాల్లో వాగులు అలుగు పోస్తుండటంతో రవాణా స్తంభించింది.మంగళవారం భారీగా కురిసిన వర్షాలనేపథ్యంలో వరంగల్ నగరంలో ముంపు నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ నెల 16 వరకు భారీ వర్ష సూచనలు ఉండటంతో బల్దియా అధికారులు సిబ్బంది అందుబాటులో ఉన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారు. ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, అధికారులు పరిశీలించారు. వరంగల్ నగర పరిధి చింతల్ మైసమ్మ గుడి వద్ద డ్రైన్ వాటర్ పనులను బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి పరిశీలించారు. సురక్షిత ప్రాంతాలకు తరలించిన వారికి మంచి నీరు, ఆహారం అందజేస్తున్నారు. 30కి పైగా కాలనీల్లో సుమారు



వెయ్యి కుటుంబాలు ముంపు తీవ్రతను ఎదుర్కొన్నాయి. జయశంకర్ –భూపాలపల్లి జిల్లా ప్రధాన ఆస్పత్రిలోని పలు వార్డుల్లోకి వరదనీరు చేరి రోగులు ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకొని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరిశీలించారు. వైద్యరోగ్య శాఖ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే వర్షపు నీరు చేరిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గణపురం మండలం ధర్మరావుపేట, గణపురం, వెళ్తుర్లపల్లి, అప్పయ్యపల్లి గ్రామాల మధ్య ఉన్న మోరంచ వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో పంట పొలాలు మొత్తం నీట మునిగాయి. రైతులు నాలుగు రోజుల క్రితం వేసిన వరి నాట్లు నీట మునిగిందని లబోదిబోమంటున్నారు.

### వాగులు పొంగిపొర్లుతుండటంతో ఇక్కట్లు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలతో పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. కుమురం భీం–ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలోని ఏకైక జలాశయం పాల్వాయి పురుషోత్తం రావు పూర్తిగా నీటితో నిండిపోయి ఎర్రవాగు, నల్లవాగు, మత్తడిలు పొంగి పొర్లుతున్నాయి. దిగువ ప్రాంతంలో ఎర్రవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గిరవెల్లి, గెర్రే, కొంచవెల్లి, పీకాలగుండం గ్రామాల్లో పంటలు పూర్తిగా నీట మునిగిపోయాయి.

## భూధార్ కేటాయింపులపై దృష్టి సారించాలి

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భూములకు భూధార్ నెంబర్ల కేటాయింపునకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై సీఎం సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో అధికారులు స్వీకరించిన వారసత్వ, ఇతర మ్యుటేషన్లకు సంబంధించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. లైసెన్డ్ సర్వేయర్లు సర్వే చేసిన తర్వాత కూడా రెగ్యులర్ సర్వేయర్లు వాటిని స్క్రూటినీ చేసేలా చూడాలని ఆదేశించారు. కోర్ అర్బన్ ఏరియాల్లో నూతనంగా నిర్మించనున్న 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నమూనాలను సీఎం పరిశీలించారు. ప్రతి కార్యాలయంలో పార్కింగ్, క్యాంటీన్, ఇతర మౌలిక వసతులు ఉండాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయిందనే విషయాన్ని అధికారులు ఈ సందర్భంగా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈనెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఆయన వారికి సూచించారు. హైదరాబాద్ నగరంలోని హౌసింగ్ బోర్డుతో జాయింట్ వెంచర్‌గా ఉన్న ప్రాజెక్టుల్లోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర రెవెన్యూ, గృహ



నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, కె.ఎస్.శ్రీనివాసరాజు, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, సీసీఎల్‌ఏ కార్యదర్శి డీఎస్ లోకేశ్ కుమార్, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపీ. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండండి - అలసత్వం వద్దు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందంటూ వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో నీటిపారుదల శాఖాధికారులు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రానున్న 72 గంటలలో ప్రతినిమిషం ఎంతో విలువైనదనీ, ఇలాంటి సమయంలో ప్రతి ఒక్కరూ విధుల్లో ఉండాలని ఆయన సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న నీటిపారుదల శాఖ ఇంజినీర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో నీటిపారుదల శాఖా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సంయుక్త కార్యదర్శి కే. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నాగార్జునసాగర్, జూరాల, కడెంతో సహా ప్రధాన



ప్రాజెక్టులపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రాజెక్టుల వద్ద 24 గంటలూ పహారా పెట్టాలన్నారు. కాల్వకట్టలు తెగిపోయే సూచనలు గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.అందుకు అవసరమైన నిధుల కొరకై జీ.ఓ నెంబర్ 45 ప్రకారం అత్యవసర నిధులను వినియోగించుకోవాలన్నారు. పాలనాపరమైన అనుమతుల విషయంలో ఎటువంటి జాప్యం లేకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అలాగే నీటిపారుదల శాఖాధికారులు అటు రెవిన్యూ ఇటు పోలీస్ అధికారులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ఎలాంటి విపత్తులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. విపత్తు సమయంలో ప్రతి నిమిషం విలువైనదనీ, ఇటువంటి సమయంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## రింగ్‌రైల్ ప్రాజెక్ట్ ప్రణాళికలు వేగవంతం

అమృత్ తెలంగాణ: ఆర్‌ఆర్‌ఆర్‌కు సమాంతరంగా కొత్త రవాణా వ్యవస్థకు దక్షిణ మధ్య రైల్వే ఊపిరిపోయనుంది, 392 కి.మీతో ఔటర్ రింగ్ రైల్(ఓఆర్‌ఆర్) నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నది. ఇప్పటికే సర్వే ప్రారంభించిన దక్షిణ మధ్య రైల్వే, వచ్చే అక్టోబరు నాటికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రైల్వేబోర్డుకు పంపనుంది. దేశానికే తలమానికంగా రూ. 12,070 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు. మరే ఇతర రాష్ట్రంలోనూ ఈ తరహా ప్రాజెక్టు లేకపోవడం గమనార్హం.

### ఎనిమిది జిల్లాలు..26 స్టేషన్లు

ఎనిమిది జిల్లాల పరిధిలోని 14 మండలాల్లో 26 కొత్త రైల్వే స్టేషన్లు ఓఆర్‌ఆర్‌తో రానున్నాయి. ఆరు రైల్ ఓవర్ బ్రిడ్జీలు నిర్మించనున్నారు. ఆర్‌ఆర్‌ఆర్, ఓఆర్‌ఆర్‌తో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ చుట్టూ భారీ టౌన్‌షిప్‌లు కొత్తగా రావడంతోపాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఊతమివ్వ నుంది. కనెక్టివిటీ పెరిగి, ట్రాఫిక్ తగ్గుతుందని అంచనా. ఓఆర్‌ఆర్‌ను పాత మెట్రోతో ఎంఎంటీఎస్‌కు అనుసం ధానం చేయనున్నారు. హైదరాబాద్‌పై భారాన్ని తగ్గించ డం, గ్రామీణ పట్టణాలను బలోపేతం చేయడం ఈ ప్రాజెక్ట్ ముఖ్యఉద్దేశ్యం. బస్సు స్టేషన్లనూ అనుసంధానం చేస్తారు.

### రెండు విడతల్లో పూర్తి

ఔటర్ రింగు రైల్‌ను రెండు విధతల్లో పూర్తి చేస్తారు. మొదటి విడత 2027 నాటికి, రెండో విడత 2030 నాటికి ప్రారంభిస్తారు. ఆర్‌ఆర్‌ఆర్, ఓఆర్‌ఆర్ మధ్య దూరం మూడు నుంచి ఐదు కిలోమీటర్ల మేర ఉండనుంది. ఈ మేరకు నిర్మాణం చేస్తారు. ఆరు ప్రాంతాల్లో కొత్త రైల్వే లైన్లు వేస్తారు. ఈ ప్రాజెక్ట్ పూర్తి అయితే హైదరాబాద్ నగరం మరింత విస్తరిస్తుంది. మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, యాదాద్రి–భువనగిరి, సిద్ధిపేటజిల్లాల్లో మూసాయిపేట, గుళ్లగూడ, బూర్గుల, వలిగొండ, వంగపల్లి, గజ్వేల్ మండలాల మీదుగా రింగు రైల్ అలైన్‌మెంటు వెళ్తుంది. ఈ ప్రాజెక్టును ఇంటిగ్రేటెడ్ మల్టీ–మోడల్ ట్రాన్స్‌పోర్టు నెట్‌వర్క్‌గా పిలుస్తున్నారు.

### భూసేకరణే సవాల్

ప్రాంతీమ బాహ్య వలయ రహదారి(ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణానికి సంబంధించి భూసేకరణే ప్రభుత్వాలకు అతిపెద్ద సవాల్. ఇప్పుడు దానికి అనుసంధానంగా రింగ్ రైల్ ప్రాజెక్ట్‌ను కూడా చేపట్టి, ఒకేసారి భూ సేకరణ చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యం. అందుకే ట్రిబుల్ ఆర్‌కు సంబంధించిన భూ సేకరణను తాత్కాలికంగా నిలుపుదల చేసినట్టు సమాచారం. అయితే భూమిని కోల్పోయే నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించే విషయంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ)కి, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య సమన్వయం కుదరడం లేదు. ఇటీవల ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు,



ప్రభుత్వ ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఎన్‌హెచ్‌ఏఐ పర్యవేక్షణలో చేపడుతున్న ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగానికి ఇప్పటికే టెండర్లు పిలవగా, ఇంకా పలు ప్రాంతాల్లో భూసేకరణ పూర్తికాకపోవడం గమనార్హం. భూములకు బదులు భూములివ్వాలనీ, లేనిపక్షంలో బహిరంగ మార్కెట్ ధర ప్రకారం తమకు పరిహారం చెల్లించాలని బాధిత రైతులు, భూయజమానులు డిమాండ్ చేస్తున్నారు. నోటిఫికేషన్ జారీచేసే నాటికి ఉన్న ధరల ప్రకారమే నష్టపరిహారం చెల్లించేందుకు నిబంధనలు అనుమతిస్తాయని ఎన్‌హెచ్‌ఏఐ అంటున్నది. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే చేపడతామని ప్రకటించినా, నిధుల కొరత నేపథ్యంలో వెనక్కి తగ్గింది. దక్షిణ భాగం కూడా కేంద్రమే చేపట్టాలంటూ రాష్ట్రం, కేంద్రానికి పలుమార్లు లేఖలు రాసింది. దక్షిణ భాగం అలైన్‌మెంటులో కొన్ని మార్పులు, చేర్పులు జరిగాయి. గతంలో ఖరారుచేసిన అలైన్‌మెంటుకు మరో ఐదు కిలోమీటర్ల వరకు దూరం పెరిగింది. దీంతో సేకరించాల్సిన భూములు సైతం అధికం కానున్నాయి.

### ట్రిబుల్ ఆర్ టెండర్లు పిలిచారు

ఆర్‌ఆర్‌ఆర్‌ను 2017లో అప్పటి సర్కారు ప్రతిపాదిం చింది. ఇప్పటివరకు సంబంధిత నిర్మాణ సంబంధమైన ప్రక్రియ పూర్తికాలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ విషయంలో చురుగ్గా వ్యవహరించకపోవడంతో అప్పట్లో ఎన్‌హెచ్‌ఏఐ తేలిగ్గా తీసుకుంది. యుటిలిటీ చార్జీలు చెల్లించాలని కేంద్రం పెట్టిన షరతులకు బీఆర్‌ఎస్ సర్కారు ఒప్పుకోలేదు. దీంతో ప్రాజెక్టు పెండింగ్‌లో పడిపోయింది. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తరభాగం 161.518 కిలోమీటర్ల మేర నిర్మాణం చేయాల్సి ఉంది. ఇందుకోసం రూ. 7104.06 కోట్లు ఖర్చవుతుంది. ఈ మేరకు ఇటీవల ఎన్‌హెచ్‌ఐఏ టెండర్లు పిలిచింద్టి. ఐదు ఫ్యాకేజీలుగా నిర్మిస్తున్న ఉత్తర భాగంలో ఒక్కో ఫ్యాకేజీకి రూ. 1100 కోట్ల నుంచి రూ. 1700 కోట్ల వరకు వ్యయం చేయాల్సి వస్తుంది.

## తెలంగాణలో 11 జిల్లాలకు రెడ్ అలర్ట్




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణలో 11 జిల్లాలకు – మరోసారి రెడ్ అలర్ట్ జారీ చేసింది వాతావరణ కేంద్రం. హైదరాబాద్, సంగారెడ్డి, మెదక్, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, సూర్యాపేట, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం హెచ్చరించారు. రెండు రోజులపాటు హైదరాబాద్ లాంటి మహా నగరాలలో ఆఫీసులకు సెలవు ఇచ్చారు. ఇంటి నుంచే పని చేయాలని స్పష్టం చేశారు. వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉన్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు జారీ చేశారు. వర్షం కురిసే సమయంలో ప్రజలు ఎవరు కూడా బయటికి రాకూడదని చెప్పారు. వర్షంతో పాటు ఉరుములు, మెరుపులు పడే అవకాశం ఎక్కువగా ఉందని చెబుతున్నారు.

## వరద కెనాల్ నందు కొట్టుకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి శవం.




ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ ఆగస్టు 13 ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజేశ్వరరావు పెట్ గ్రామ శివారులో గల వరద కెనాల్ నందు గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చినది. మృతదేహం ఎత్తు అందాద 5.2 ఉండి, నీలం రంగు డబ్బాలుగల షర్టు, నీలం రంగు కాటన్ జీన్స్ మరియు ప్యాంటు లోపల తెలుపు రంగు బాక్సర్ షాట్ ధరించి ఉన్నాడు, మృతి చెందిన వ్యక్తి తల భాగంలో వెంట్రుకలు లేకుండా, మరియు గుర్తుపడితే,క్రింది నెంబర్లకు ఫోన్ చేసి తెలుపాలని పోలీసులు తెలిపారు.. ఎస్సై ఇబ్రహీంపట్నం 8712656795 సీఐ మెట్పల్లి 8712656819 కానిస్టేబుల్ ఇబ్రహీంపట్నం 8712524862


## భార్యపై హత్యాయత్నం కేసులో భర్తకు ఐదు సంవత్సరాలు జైలు శిక్ష1000 రూపాయల జరిమానా విధించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే ప్రభాకర్ రావు.




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి మావల పోలీస్ స్టేషన్ నందు కేసు పదిమంది సాక్షుల విచారణ కృషి చేసిన సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ మావల సిఐ కర్రె స్వామి మావల సీఐ తెలిపిన వివరాల ప్రకారం తేదీ 18-12-24 రోజున పిట్టల వాడ ఆదిలాబాద్ కి చెందిన జాదవ్ మహేష్ S/O ఆనందరావు ఫిర్యాదు మేరకు తన తండ్రి జాదవ్ ఆనందరావు తన తల్లిని మద్యం తాగి వచ్చి అమ్మతో గొడవపడేవాడని అట్టి విషయంపై తన యొక్క అన్న నచ్చి చెప్పి వారని, రోజువారి మాదిరిగానే మా నాన్న జాదవ్ ఆనందరావు ఉదయం 4 గంటల సమయంలో అమ్మను సుత్తితో తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచినాడని తెలిపారు. వెంటనే రిమ్స్ ఆసుపత్రికి తరలించి పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేయగా ఎస్ఐ విష్ణువర్ధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తిచేసి కోర్టు నందు చార్జిషీటు దాఖలు చేయగా, కోర్టు డ్యూటీ అధికారి సిహెచ్ సంతోష్ 10 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పి పి ఏ ఏ రెహమాన్ గారు కోర్టు కేసును వాదించగా నేరము రుజువైన కారణంగా గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారు కే ప్రభాకర్ రావు గారు నేరస్తునికి ఐదు సంవత్సరంల కఠిన కారాగార శిక్ష మరియు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువడించారని తెలిపారు. ఈ కేసు నందు ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

## అదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ రావాలి - NHRC జిల్లా వైస్ చైర్మన్ రాథోడ్ సందీప్ డిమాండ్






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ నేరడిగొండ మండలంలో అదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని గళమెత్తుతూ NHRC జిల్లా వైస్ చైర్మన్ రాథోడ్ సందీప్ ఆధ్వర్యంలో విశేష సమావేశం జరిగింది. అనంతరం నేరడిగొండ ఎమ్మార్వో శ్రీ సయ్యద్ అబ్దుల్ కలీం - వారికి వినతిపత్రం అందజేసి, యూనివర్సిటీ ఏర్పాటు అత్యవసరమని కోరారు. ఈ సందర్భంగా రాథోడ్ సందీప్ మాట్లాడుతూ "మా అదిలాబాద్ జిల్లాలో యూనివర్సిటీ లేకపోవడం వలన విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లి ఆర్థిక, భద్రతా, వసతి సమస్యలను ఎదుర్కొంటున్నారు. పలువురు విద్యార్థులు చదువును మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు జరిగితే నాణ్యమైన విద్య అందించబడటమే కాకుండా, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి, జిల్లా అభివృద్ధి వేగవంతమవుతుంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ మండల చైర్మన్ నర్సింగ్ దాస్, వైస్ చైర్మన్ సతీష్, కోఆర్డినేటర్ కృష్ణ పాల్గొన్నారు. అలాగే పెద్ద ఎత్తున హాజరైన యువతలో సాబ్లే సంతోష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు

## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి : బోరంచు శ్రీకాంత్ రెడ్డి


బోరంచు శ్రీకాంత్ రెడ్డి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉన్నందున, ఎవరూ వాటిని దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. అలాగే, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని విజ్ఞప్తి చేసారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న వారు ఎవరైనా ఉంటే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని కోరారు. రైతులు కరెంటు వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని కరెంటు స్థంభాలు, ట్రాన్సాఫార్మర్స్, ముట్టుకోరాదని కోరారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్ద కు వెళ్ళరాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేసి, నిరంతరం పర్యవేక్షణ జరిపేలా ఆదేశాలు జారీ చేస్తున్నందున వాగులు, చెరువులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లు , జిల్లా అధికారులందరూ పనిచేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ప్రజలకు అవగాహన కల్పించి, వారు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి: ఏంఈఓ బండారి మధు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏంఈఓ బండారి మధు.

ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ ఆగస్టు 13 మండల వనరుల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులతో ఎంఇఓ బండారి మధు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఇబ్రహీంపట్నం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రధానోపాధ్యాయులు పాఠశాల స్థాయి ప్రణాళికలను రచించుకుని వాటిని అమలు చేస్తూ విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఇందులో విద్యార్థుల యొక్క ప్రగతి నివేదికలను ప్రగతి నివేదికలను సమీక్షించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వారిని అన్ని రంగాల్లో ముందుకు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. విద్యార్థుల యొక్క ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో పొందుపరచలన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రతి ఒక్క పాఠశాలలో అమలు చేయాల్సిందిగా సుచన చేశారు.

## భైంసాలో బుధవారం ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా: జి.జానకి షర్మిల ఐపిఎస్

### బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం




అమృత్ తెలంగాణ భైంసా న్యూస్ నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ గారు బుధవారం భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 11 మంది ఆర్జిదారుల ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు. ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కుటుంబ వివాదాల పరిష్కారంలో 'షీ టీం' పాత్ర:

ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు "నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, భైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ గారు చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష:

ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

## సాత్నాల ప్రాజెక్ట్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ ఎస్పీ అఖిల్ మహాజన్

### అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బుధవారం రోజున సాత్నాల ప్రాజెక్ట్ ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా , జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించారు. ప్రాజెక్టులో నీటిమట్టాన్ని స్వయంగా పరిశీలించి, ప్రస్తుత పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే స్పందించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని , భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఎక్కడ కూడా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా కలెక్టర్ ఎస్పీ మొక్కలు నాటారు ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారి విఠల్, AE లు, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాదరక్షల పంపిణీ.

### ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ .


ఎమ్మెల్యే ను సన్మానిస్తున్న దృశ్యం


విద్యార్థులకు పాదరక్షలను అందజేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

నిర్మల్ జిల్లా భైంసా ఆగస్టు 13 అమృత్ తెలంగాణ భైంసా మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల నందు మాజీ జెడ్పిటిసి భోస్లే పండిత్ రావు పటేల్,లి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పాదరక్షల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్.లి విద్యార్థులకు పాదరక్షలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యతో మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యమని, విద్యార్థు లంతా బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులను మట్టిలో మాణిక్యాలుగా తయారు చేయడానికి ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తయారుచేసి పేదలకు నాణ్యమైన విద్యను అందించాలన్నదే నా లక్ష్యమన్నారు. అనంతరం పాఠశాల పరిసర ప్రాంతాన్ని పరిశీలించి పాఠశాలకు ప్రహరీ గోడ,మైనర్ రిపేర్లు, వైరింగ్, తాగునీరు, బాత్రూం, తరగతి గదుల్లో ఫ్లోరింగ్, తదితర మరమ్మతుల సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, మాజీ జడ్పీటీసీలు, బిజెపి అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## మూసి కాల్వ లెవెల్ బ్రిడ్జిలను పరిశీలించిన కమిషనర్..



భువనగిరి : హైదరాబాద్‌లో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల ప్రభావంతో మూసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో ఈరోజు రాచకొండ పోలీస్ కమిషనర్ జి సుధీర్ బాబు భూదాన్ పోచంపల్లి వద్ద ఉన్న జూలూరు మూసి లో లెవెల్ బ్రిడ్జి, సంగం బ్రిడ్జులను బుధవారం పరిశీలించారు. వరదనీరు ఎక్కువగా వచ్చే పరిస్థితుల్లో రహదారులను తాత్కాలికంగా మూసివేయాలని అధికారులను సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు అధికారులు పూర్తిగా సిద్ధంగా ఉండాలని తెలిపారు. పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో ముందుకు పోవాలని కోరారు. డిసిపి అక్షాన్స్ యాదవ్, ఏసీపీ, సిఐలు, ఎస్సైలు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

## నషా ముక్త భారత్ అభియాన్ పై అవగాహన కార్యక్రమం - విద్యార్థులతో కలసి మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేసిన జిల్లా కలెక్టర్






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి మాదకద్రవ్యాల వాడకాన్ని నిరోధించే లక్ష్యంతో నషా ముక్త భారత్ అభియాన్ (Nasha Mukt Bharat Abhiyan) కింద అవగాహన కార్యక్రమం బుధవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం స్పోర్ట్స్ స్కూల్ లో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొని విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, "యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, శారీరక-మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి దీక్షతో ముందుకెళ్లాలని" పిలుపునిచ్చారు.

మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ

నేను మాదక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, నేను డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరిస్తూ, నాతో పాటు ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని, నేను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయుచున్నాను. మాదకద్రవ్యాల బారిన పడకుండా సమాజం అంతటా చైతన్యం పెంపొందించాలన్నదే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, dyso శ్రీనివాస్, dieo గణేష్, మలేరియా అధికారి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టం.
# రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డా.చంద్రశేఖర్ రెడ్డి.






అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి పాలనలో పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టాన్ని తెచ్చారని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ చార్ట్ ను తప్పనిసరిగా ప్రదర్శించాలని రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ డా. చంద్రశేఖర్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టంపై రాష్ట్ర సమాచార కమిషనర్ ఆధ్వర్యంలో పీఐవో అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో సమాచార కమిషనర్లు పర్వీన్, భూపాల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం పౌరులకు పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన అందించడంలో కీలకమైన సాధనమని తెలిపారు. ఆర్టీఐ దరఖాస్తులు, ఫిర్యాదులు తక్కువ అందిన జిల్లాల్లో నిర్మల్ ఓకటన్నారు. పీఐవో అధికారులు ప్రజలకు సమయానికి, పూర్తి సమాచారాన్ని అందించాలి అని సూచించారు. RTI దరఖాస్తుల పరిష్కారం ఆలస్యం కాకుండా, చట్టంలో ఉన్న సమయపరిమితి లోపల సమాధానమివ్వాలని ఆదేశించారు. సమాచారాన్ని దాచిపెట్టడం, తప్పుడు సమాచారం ఇవ్వడం వంటి చర్యలు చట్టవిరుద్ధమని హెచ్చరించారు. RTI చట్టాన్ని సక్రమంగా అమలు చేస్తే అవినీతి తగ్గిపోతుందని, ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ శాఖలు పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్క అధికారి అవగాహన పెంచుకోవాలన్నారు. నిర్మల్ జిల్లాలో ఆర్టీఐ అప్పీల్ కేసులను కలెక్టరేట్లో కమిషన్ ప్రత్యేకంగా పరిష్కారానికి చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలోని అన్ని పీఐవో అధికారులు చట్టపరమైన నిబంధనలను పూర్తిగా అనుసరించాలి అని పేర్కొన్నారు. రాష్ట్ర సమాచార కమిషన్ కమిషనర్లు పర్వీన్, భూపాల్ మాట్లాడుతూ, ఆర్టీఐ చట్టం సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత పీఐవో, ఏపీఐవోలదేనన్నారు. కమిషన్ ఏర్పాటు తర్వాత 18 వేల కేసుల్లో 2300కుపైగా పరిష్కరిం చామన్నారు. అనంతరం స.హ. చట్టంపై సందేహాలను నివృత్తి చేశారు. సదస్సులో పీఐవో అధికారులకు సమాచార హక్కు చట్టం నిబంధనలు, దరఖాస్తుల పరిష్కార విధానం, అప్పీల్ ప్రక్రియపై పవర్ పెయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్లుప్తంగా వివరించారు. అనంతరం కమిషనర్లను జ్ఞాపికలతో కలెక్టర్, అధికారులు సత్కరించారు. సమావేశానికి ముందు కలెక్టరేట్ ప్రాంగణంలో కమిషనర్లు, కలెక్టర్ మొక్కలు నాటి నీరుపోశారు. సదస్సు అనంతరం, రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ ఆధ్వర్యంలో వివిధ సమాచార హక్కు దరఖాస్తులు, అప్పీల్స్‌పై ఇయరింగ్ (విచారణ) నిర్వహించారు. సంబంధిత పీఐవో అధికారులు, దరఖాస్తుదారుల నుండి వివరాలు స్వీకరించి తగిన ఆదేశాలు జారీ చేశారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, బైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకల్యాణి, వివిధ శాఖల అధికారులు, పిఐఓ లు, ఎపిఐఓలు, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల నుంచి బస్టాండ్ల వరకు – ”మాదక ద్రవ్యాల నిర్మూలన కొరకు సామూహిక ప్రతిజ్ఞ

## జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం






అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఈరోజు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో “నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం” లో భాగంగా, మాదకద్రవ్యాల దుర్వినియోగ నిర్మూలన” పై ఒక విశేషమైన సామూహిక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా, పోలీస్ అధికారులు, సిబ్బంది స్థానిక పాఠశాలల్లో, కళాశాలల్లోని విద్యార్థులతో, ఉపాధ్యాయులతో మరియు గ్రామాల్లో పట్టణాల్లో,బస్టాండుల్లో, ప్రజల చేత “మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా,మాదక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ రహిత సమాజాన్ని అనుసరిస్తానని ప్రజలతో సామూహిక ప్రతిజ్ఞ” చేయించారు. ప్రతిజ్ఞలో తమ జీవితంలో ఎప్పుడూ మాదకద్రవ్యాలు వాడబోమని, వాటి వినియోగాన్ని ప్రోత్సహించబోమని, సమాజం మత్తు రహితంగా ఉండేలా చైతన్యం కల్పిస్తామని ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది మాట్లాడుతూ..ప్రజలకు మాదకద్రవ్యాల వాడకంతో కలిగే ఆరోగ్య నష్టం, కుటుంబాలకు, సమాజానికి కలిగే దుష్పరిణామాలను వివరించారు. యువతను ఈ మాదకద్రవ్యాల మత్తు నుండి దూరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందుకు అందరూ ఒకే తాటిపై నిలిచి పోరాడాలని పిలుపునిచ్చారు. అలాగే మాదకద్రవ్యాల వ్యాపారం,

రవాణా లేదా వినియోగం గమనించిన వెంటనే పోలీస్ అధికారులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. మాదకద్రవ్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఒకవేళ ఎవరైనా మాదకద్రవ్యాల వ్యాపారం గానీ,రవాణా లేదా వినియోగం గమనించిన వెంటనే 100 నంబరుకు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వండి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువత,మహిళలు గ్రామాల్లోని ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# శుభకార్యం లో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ జగిత్యాల్ న్యూస్ జగిత్యాల లోని పద్మనాయక కల్యాణ మండపంలో జరిగిన కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి –దేవేందర్ రెడ్డి కుమార్తె,యువజనకాంగ్రెస్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినూత్న రెడ్డి–అనుకేత్ రెడ్డి వివాహానికి కుటుంబ సభ్యులతో హాజరై మాజీ మంత్రివర్యులు జీవన్ రెడ్డితో కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి

# ఎస్.కె మైక్రో ఫైనాన్స్ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పెద్ద ఎత్తున మోసం చేసిన వ్యక్తి అరెస్టు, రిమాండ్ కు తరలింపు

**జిల్లాలో దాదాపు 300 మంది కి ఉద్యోగాల పేరుతో మోసం.**
**జిల్లా వ్యాప్తంగా 16 కేసులు నమోదు.**
**నిందితుని వద్దనుండి 9 లక్షల నగదు,10.7 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం.**
**ఐదు మొబైల్ ఫోన్లు, ఒక ఖరీదైన వాచ్, రెండు కార్లు స్వాధీనం**
**ఐదుగురు అరెస్టు.**
**NRI అంటూ, సామాజిక సేవ పేరుతో ప్రముఖులతో పరిచయాలు చేసుకొని వందల మందిని బురిడీ కొట్టించిన నిందితుడు.**
**చాకచక్యంగా పట్టుకున్న ఆదిలాబాద్ జిల్లా పోలీసులు.**
**పాత్రికా సమావేశంలో వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.**





మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహజాన్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి

నిందితుని వివరాలు

జవాడే కృష్ణ ఏ జాదవ్ కృష్ణ (38) s/o శేషారావు, సోనాయి కాంప్లెక్స్, బారామతి, పూనా, మహారాష్ట్ర.

పుట్టిన స్థలం : శంకర్గూడ గ్రామం, ఇంద్రవెల్లి మండలం.

మైక్రో ఫైనాన్స్ లో మరియు ప్రభుత్వ ఆసుపత్రుల నందు అంగన్వాడీల నందు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని వందల మందిని మోసం చేసిన ప్రధాన నిందితుడు జవాడే కృష్ణ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలియజేశారు. బుధవారం స్థానిక పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ వివరాలను వెల్లడించారు,

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలను మోసం చేసిన వ్యక్తులను ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, ప్రతి ఒక్కరూ చట్టప్రకారం శిక్ష అర్హులని, అమాయక సాధారణ ప్రజలను బురిడీ కొట్టించి ఉద్యోగాలు ఇస్తానంటూ డబ్బులు వసూలు చేసి, జల్సాలకు తిరుగుతూ ఖర్చు చేసి, సామాజిక సేవ పేరుతో ప్రముఖుల పరిచయాలతో ప్రచారం చేసుకుని, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 300 మందిని మోసం చేసిన జవాడే కృష్ణను అరెస్టు చేయడం జరిగిందని, ప్రజలను మోసం చేసిన ఎవరిని విడిచి పెట్టేది లేదని హెచ్చరించారు.

నిందితునిపై ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 16 కేసులు నమోదయి,

ఉట్నూర్ లో – 3,
ఇంద్రవెల్లిలో – 3,
నార్నూర్లో – 2,
మావల లో – 3,
ఆదిలాబాద్ వన్ టౌన్ లో – 2,
జైనథ్ లో – 3,

చొప్పున దాదాపు 16 కేసులు నమోదు అయిన విషయాన్ని తెలియజేశారు.

వివరాలలో

2024 సంవత్సరం డిసెంబర్ నందు ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నందు, ఉట్నూరు నందు ఎన్నారై అంటూ ఎస్కే మైక్రో ఫైనాన్స్ పేరుతో కార్యాలయాలను ప్రముఖులతో ప్రారంభించి తన నేర పద్ధతిని ప్రారంభించాడు. మైక్రో ఫైనాన్స్ నందు ఉద్యోగాలు ఇప్పిస్తాను అని జిల్లావ్యాప్తంగా రెండు కార్యాలయాలలో దాదాపు 300 మంది వద్ద 20 వేల రూపాయల మెంబర్షిప్ తీసుకుని ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని చెప్పి మోసం చేయడం జరిగిందని, అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల నందు స్టాఫ్ నర్స్, ఏఎన్ఎం మరియు అంగన్వాడీ ఉద్యోగాలు ఇప్పిస్తానని కొంతమంది వద్ద డబ్బులను తీసుకోవడం చేసి మోసం చేయడం జరిగిందని తెలిపారు. మొదటగా ఈ రెండు కార్యాలయాల్లో ఐదుగురు ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవడం వారి ద్వారా నగదు రూపంలో ఒక్కొక్కరి వద్ద 20 వేల రూపాయలను తీసుకొని దాదాపు జిల్లా వ్యాప్తంగా 54 లక్షలు అదే విధంగా ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగాల పేరుతో 15 లక్షలు వసూలు చేసి మొత్తం 69 లక్షల ఇప్పటివరకు జరిగిన వసూలు చేసినట్టు విచారణలో తేలిందని తెలిపారు. ఈ డబ్బు అంతా భవిష్యత్తులో దొరకకుండా నగదు రూపంలో స్వీకరించడం జరిగిందని తెలిపారు. డిసెంబర్ నుండి ఆరు నెలల పాటు ఈ కార్యక్రమాలు చేసి ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో బాధితులు తరచూ అడుగుతూ ఉండడంతో జులై నెల మొదటి వారంలో తన సొంత గ్రామం శంకరగుడా నందు తొమ్మిది లక్షల నగదు మూడు లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు దాచి, 15 లక్షల నగదు తో పారిపోవడం జరిగింది అప్పటినుండి జిల్లా పోలీస్ యంత్రాంగం అతనిని అన్వేషిస్తూ ఈరోజు పట్టుకోవడం జరిగిందని తెలిపారు.

ఇతని వద్ద నుండి దాదాపు తొమ్మిది లక్షల నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందని,

5.5 తులాల ఉంగరాలు,
1.2 తులాల బంగారు కాయిన్స్.
4 తులాల బంగారు చైన్ (3 చైన్లు) .

మొత్తం 10.7 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.

ప్రజల దగ్గర దోచుకున్న డబ్బులతో బంగారు ఆభరణాలు, కారు కొన్నట్లు తెలిపారు.

ప్రజల వద్ద నుండి విడతలవారీగా మోసం చేసి తీసుకున్న డబ్బులలో

ఆరు లక్షలు ఆదిలాబాద్ లో ఒక ప్రైవేటు హోటల్ యజమానికి.
ఆరు లక్షల నాగపూర్ నందు గల భవన యజమానికి.
3.5 లక్షలు ఆదిలాబాద్ ఉట్నూర్ కార్యాలయాలకు.
2.1 లక్షలు తమ్ముని అవసరాల నిమిత్తం.

మిగిలినవి జల్సాలకు తప్పించుకోవడానికి ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు.

తమ్ముడు జవాడే గోపాల్ (అరెస్టు)

మిగిలిన ఐదుగురు ఏజెంట్ల వివరాలు

ఆత్రం నారాయణ(అరెస్టు), డాకురే శత్రుఘన్(అరెస్టు), మధ్యవర్ ఆదినాథ్(అరెస్టు), ఆత్రం రాహుల్(పరారీ), మిశ్రమ ప్రహల్లాద్(పరారీ). ముఖ్యంగా ఎన్నారై పేరుతో, సామాజిక సేవ చేస్తానంటూ భారీ ఎత్తున ప్రజలను మోసం చేసి తప్పించుకు తిరుగుతున్న నిందితున్ని జిల్లా పోలీసులు పట్టుకుని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. బాధితులు ఇంకా ఎవరైనా ఉన్నట్లయితే జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ ఐపీఎస్, ఉట్నూర్ సీఐ ఎం ప్రసాద్, ఐటీ కోర్ ఎస్సై గోపికృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీ అఖిల్ మహాజన్ కలిసిన నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై కే నాగరాజు



అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ టు టౌన్ ఇన్స్పెక్టర్ గా టూ టౌన్ ఎస్ఐ కే నాగరాజు బాధ్యతల స్వీకరణ. మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ పూల మొక్క అందజేసి కలవడం జరిగింది. ఇదివరకే సిఐగా కొనసాగిన సిహెచ్ కరుణాకర్ రావు భూపాలపల్లి జిల్లా ఘనపూర్ కు సర్కిల్ ఇన్స్పెక్టర్గా బదిలీ ఆవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా పట్టణంలో ఉన్న పరిస్థితులు పై ప్రత్యేకంగా సూచనలు ఇచ్చారు. కె నాగరాజు మెదక్ సిసిఎస్ నుండి ఆదిలాబాద్ టు టౌన్ ఇన్స్పెక్టర్గా బదిలీ ఆవ్వడం జరిగింది.

# డ్రగ్ మహమ్మారిని నిర్మూలిద్దాం: ఎస్పీ



రాజన్న సిరిసిల్ల :అమృత్ తెలంగాణ: మాధకద్రవ్యాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నాషా ముక్త్ భారత్ అభియాన్ ఐదు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం మేరకు జిల్లాలో విద్యాసంస్థల్లో మాధకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. జిల్లా పోలీస్ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన మాధకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమంలో అధికారులు, సిబ్బందితో కలసి ఎస్పీ పాల్గొని మాట్లాడుతూ.. నేను మాధకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ, నాతో పాటు ఎవ్వరూ డ్రగ్స్ భారిన పడకుండా కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు అందిస్తానని, డ్రగ్స్ రహిత సమాజాన్ని లక్ష్యంగా పెట్టుకున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేపించడం జరిగిందన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యమై డ్రగ్స్ మహమ్మరిని నిర్మూలించి భావితరాలకు మంచి భవిష్యత్తు అందిద్దామని పిలుపునిచ్చారు.ప్రతి విద్యార్థి,యువత యాంటీ డ్రగ్ సోల్జర్ గా మారి మాధకద్రవ్యాల వలన కలుగు అనర్ధాలపై అవగాహన కల్పించాలన్నారు.సమాజంలో మాదక ద్రవ్యాలు సమూలంగా నిర్మూలించటలో యువత,ప్రజలు పోలీసువారికి సహకరించుటలో కీలక పాత్ర పోషించాలని కోరారు.

జిల్లాలో అక్రమంగా గంజాయి సేవించిన, క్రయవిక్రయాలు జరిపిన,కఠిన చర్యలు తప్పవని ఈసందర్భంగా హెచ్చరించారు.గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి పోలీస్ స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ లు ,నార్కోటిక్ జగిలాలతో తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ గంజాయి రవాణాపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ఉక్కుపాదం మోపుతున్నారని తెలిపారు.

జిల్లాలో ఈసంవత్సరం 40 కేసులల్లో 98 మందిని అరెస్ట్ చేసిన 3.700 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గంజాయికి సంబంధించిన సమాచారం సబంధిత పోలీస్ వారికి సమాచారం అందించి గంజాయి రహిత జిల్లాగా మర్చడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి పద్మ,సి.ఐ లు నటేష్,రవి,ఆర్.ఐ లు రమేష్, మధుకర్, యాదగిరి, ఎస్.ఐ లు శ్రీకాంత్, ప్రేమంనందం, జునైద్, శ్రవణ్, శ్రీనివాస్, రమేష్, పోలీస్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# హనుమాన్ ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు..



ముధోల్ :అమృత్ తెలంగాణ: నియోజక వర్గ కేంద్రమైన ముధోల్ లో గల తానూర్ బైపాస్ రోడ్డు ప్రక్కన గల హనుమాన్ మందిరం వద్ద బొగడ వాడకట్టు మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో 4 సీసీ కెమెరాలను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముధోల్ నియోజకవర్గం మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు రోళ్ళ రమేశ్ మాట్లాడుతూ గత కొన్ని నెలల నుండి ముధోల్‌లో చాలా దొంగతనాలు జరుగుతున్నాయని తెలిపారు. ముందు జాగ్రత్తగా చర్యగా సీసీ కెమెరాలు ఆలయంలో ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రోళ్ళ బాలాజీ, తెలుగాడం ధర్మన్న, హంగీర్గ లక్ష్మణ్, సంఘం మెంబర్లు వెంకటపురం పోతన్న, హంగీర్గ భోజన్న, భూమన్న,పోతన్న, గంగాధర్, సాయిలు, రాములు, సురేష్, ఈరన్న, సాయినాథ్, గంగాధర్, పోశెట్టి, శంకర్, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్యా బోధన



దుబ్బాక :అమృత్ తెలంగాణ: ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్యా బోధన అందుతుందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సర్కారు స్కూళ్ల బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యల్ని చేపడుతుందని, అందులో భాగంగానే ప్రీ ప్రైమరీ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. విద్యార్థులు ప్రీ ప్రైమరీ సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుధవారం అక్బర్ పేట భూంపల్లి మండలం చిట్టాపూర్ లో ప్రైమరీ స్కూల్ లో ఏర్పాటుచేసిన "ప్రీ ప్రైమరీ క్లాస్ రూమ్" ను ఎంఈఓ దోమకొండ అంజయ్య తో కలిసి ఆయన ప్రారంభించారు. ద్యార్థుల సంఖ్యను 31 నుంచి 82 కు పెంచేందుకు కృషిచేసిన ఉపాధ్యాయులను అభినందించి శాలువాలతో సన్మానించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం గ్రామానికి చెందిన పలువురు దాతలు రూ.60 వేలు అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. తనవంతుగా రూ.10 వేలను ఎంఈఓ అంజయ్యకు అందజేశారు. అనంతరం విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు, బుక్కులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో చిట్టాపూర్ విద్యుత్తు ఏఈ కనకయ్య, తాజా మాజీ సర్పంచ్ పోతనక రాజయ్య, కూతురు కుమార్, రాజమల్లయ్య, ఉపాధ్యాయ బృందం, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఆశయం దిశగా ప్రజా పాలన



తంగళ్ళపల్లి :అమృత్ తెలంగాణ: ఇందిరమ్మ ఆశయం దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్ కుమార్ అన్నారు. తంగళ్ళపల్లి మండలం నేరల్ల గ్రామం లో ఇందిరమ్మ ఇళ్లు కు బుధవారం లబ్ధిదారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి నాయకత్వం లో నిజమైన పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కు ప్రభుత్వం ఇసుక ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఆరు గ్యారెంటీలు తప్పకుండా అమలు చేసి తీరుతామని వివరించారు.లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు నేరెళ్ల నర్సింగం గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లింగాల భూపతి, సత్తు శ్రీనివాసరెడ్డి, మునిగల రాజు,గుగ్గిళ్ళ భరత్, గ్రామ శాఖ అధ్యక్షుడు కోలశంకర్ ,ఆనందం, ఎల్లయ్య శ్రీను నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# తెలుగు అమ్మాయిని టాలెంట్ గుర్తించాల్సిందే..!



టాలీవుడ్ లో సైడ్ రోల్స్ తో పాటుగా చిన్న సినిమాల్లో హీరోయిన్ గా చేస్తూ మెప్పిస్తున్న భామ పూజిత పొన్నాడ. తెలుగు అమ్మాయి అయిన పూజిత రంగస్థలం లో ఆది పినిశెట్టి లవర్ గా కనిపించి అలరించింది. అందం అభినయం ఉన్నా సరే అమ్మడికి లక్ కలిసి రావట్లేదు. ఆమె చేస్తున్న సినిమాలేవి ఆడియన్స్ కి పెద్దగా రిజిస్టర్ అవ్వట్లేదు. వచ్చిన అర కొర అవకాశాలనే చేస్తూ కెరీర్ వెళ్లదీస్తుంది అమ్మడు. సినిమాల కన్నా ఫోటో షూట్స్ తో ఎక్కువ క్రేజ్ తెచ్చుకుంటుంది పూజిత. అందుకే అమ్మడి సోషల్ మీడియా ఫాలోవర్స్ కూడా ఎక్కువగానే ఉన్నారు. తరచూ తన లేటెస్ట్ ఫోటో షూట్స్ తో ఫాలోవర్స్ ని అలరిస్తుంది పూజిత. అయితే తన గ్లామర్ సైడ్ కన్నా తన క్యూట్ లుక్స్ తో ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది. లేటెస్ట్ గా అమ్మడు బీచ్ లో శారీ లుక్ లో ఫోటో షూట్ చేసింది. అది చూసిన కుర్రాళ్లు పూజిత నా హృదయ దేవత నువ్వే అంటూ కామెంట్స్ చేస్తున్నారు. వైట్ కలర్ శారీలో వావ్ అనిపించేలా అమ్మడి అందాలు కేక పెట్టిస్తున్నాయి. సరైన ఛాన్స్ వస్తే చాలు తన టాలెంట్ ఏంటో చూపించాలని చూస్తున్న పూజిత పొన్నాడకి అలాంటి అవకాశం రావట్లేదని చెప్పొచ్చు. లాస్ట్ ఇయర్ ఓదెల రైల్వేస్టేషన్ సినిమాలో సెకండ్ హీరోయిన్ గా నటించిన పూజిత ఆకాశ వీధుల్లో అనే సినిమాలో హీరోయిన్ గా నటించింది. ప్రస్తుతం రవితేజ రావణాసుర తో పాటుగా తమిళంలో భగవాన్ సినిమా చేస్తుంది పూజిత. తెలుగు అమ్మాయి కదా గ్లామర్ విషయంలో అడ్డు చెబుతుందేమో అనుకుంటే తను చేస్తున్న సినిమాల్లో లిప్ లాక్స్ ఇస్తూ ఫుల్ కోపరేట్ చేస్తుంది పూజిత. అలాంటిది స్టార్ ఛాన్స్ వస్తే రెచ్చిపోకుండా ఉంటుందా చెప్పండి. కానీ అలాంటి ఛాన్స్ ఒకటి ఇచ్చి ఆమెను ఎంకరేజ్ చేస్తే మాత్రం పూజిత నెక్స్ట్ లెవల్ లో ఉంటుంది.

# 'పౌజీ' కోసం వాళ్లిద్దరి మధ్యా పోటీ!






పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా భారీ లవ్ అండ్ వార్ ని హను రాఘవపూడి తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా భారీ లవ్ అండ్ వార్ పౌజీ ని హను రాఘవపూడి తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. 1800 ఏళ్ల కాలం నాటి పీరియాడిక్ స్టోరీలో అద్భుతమైన లవ్ స్టోరీని ఆవిష్కరి స్తున్నాడు. ఇందులో అందమైన ప్రేమ కథతో పాటు అంతకు మించి కళ్లు చెదిరే భారీ యాక్షన్ ఎపిసోడ్లు కూడా ఉంటున్నాయి. ఇందులో డార్లింగ్ కి ప్రభాస్ కి జోడీగా ఇమ్మాన్వీని ఎంపిక చేసిన సంగతి తెలిసిందే లాంచింగ్ రోజే అమ్మడు అభిమానుల మనసులు దొచేసింది. తన అందచందాలతో నెట్టింట సంచల నమైంది. అటుపై డాన్సులో తానెంత ప్రొఫెషనల్ అన్నది ఓ వీడియో ద్వారా అర్దమైంది. అంతటి ట్యాలెం టెడ్ బ్యూటీ ఇంతకాలం ఎక్కడ ఉంది? అనే చర్చకు తెరి తీసిందంటే? ఇమాన్వీ పై ఏ రేంజ్ లో హై వచ్చిందో అర్దమవుతుంది. ఇమాన్వీలో ఇవన్నీ చూసే హను ఛాన్స్ ఇచ్చాడన్నది అంతే వాస్తవం. కంటెంట్ లో ఏది బెస్ట్ అంటే..? అయితే ఇందులో సెకెండ్ లీడ్ కూడా ఒకటుంది. ఆ పాత్ర కోసం ఇప్పటికే మృణాల్ ఠాకూర్ ను పరి శీలిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. కానీ మృణాల్ నటిస్తే ప్రెష్ ఫీల్ రాదు ? అన్న ఆలోచనలోనూ హను ఉన్నాడుట. ఈ నేపథ్యంలోప్రత్యామ్నాయంగా బాలీవుడ్ బ్యూటీ దిశాపటానీని పరిశీలిస్తున్నారుట. కల్కి 2898 లో దిశా నటించిన సంగతి తెలిసిందే. తెరపై కనిపించింది కాసేపే అయినా ప్రేక్షకుల్ని ఎంగేజ్ చేసింది. ఈ నేపథ్యంలో మృణాల్ కంటే దిశా పటానీ అయితే బాగుంటుందని మేకర్స్ భావిస్తున్నారుట. అయితే ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సమాచారం. దీంతో మృణాల్–దిశా పటానీ మధ్య ఛాన్స్ విషయంలో పోటీ కనిపిస్తుంది. మృణాల్ ఠాకూరు కూడా ఇప్పటి వరకూ ప్రభాస్ తో నటించే ఛాన్స్ రాలేదు. అలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తోంది. ఇప్పుడా ఛాన్స్ వచ్చినట్లే వచ్చి చేజారుతున్నట్లు కనిపిస్తుంది.

# శ్రీలంక తీరంలో బికినీ బ్యూటీ వేషాలు

ఇటీవల సమ్మర్ హీట్ అంతకంతకు పెరుగుతోంది. దీంతో సెలబ్రిటీలంతా మాల్దీవుల ప్రయాణంలో ఉన్నారు. ఇటీవల సమ్మర్ హీట్ అంతకంతకు పెరుగుతోంది. దీంతో సెలబ్రిటీలంతా మాల్దీవుల ప్రయాణంలో ఉన్నారు. గోవా టూరిజం అంతకంతకు దిగజారుతోందని నివేదికలు ఉన్నా .. లక్ష్యద్వీప్ టూరిజాన్ని డెవలప్ చేయాలని ప్రభుత్వం పూనుకున్నా.. మాల్దీవులకు డిమాండ్ తగ్గలేదు. ఒంటరి దీవుల్లో చిల్ అయ్యేందుకు తారలు ఆసక్తిగా ఉన్నారు. అయితే ఇతరులకు భిన్నంగా నేహా శర్మ ఇటీవల శ్రీలంక తీరంలో తళుక్కున మెరిపించింది. బ్లాక్ మోనోకినిలో హృదయాలను కొల్లగొట్టింది. బీచ్ లో అందమైన భంగిమలతో నేహా శర్మ చెలరేగిపోయింది. నేహా ఫిట్‌నెస్ ఫ్రీక్ అన్న సంగతి తెలిసిందే. జిమ్‌లు స్టూడియోల వెలుపల ఎక్కువగా కనిపిస్తుంది. ఇప్పుడు కూడా జిమ్ లో కసరత్తులు చేసాకే ఇలా బీచ్ లో ప్రత్యక్షమైంది. ప్రస్తుతం ఈ ఫోటోలను యువతరం వైరల్ గా షేర్ చేస్తున్నారు. ఈసారి సీక్వెల్‌లో చించేద్దాం! కెరీర్ మ్యాటర్ కి వస్తే.. నేహా చివరిగా విజయ్ దేవరకొండఫ్యామిలీ స్టార్‌లో అతిధి పాత్రలో కనిపించింది. కానీ ఈ సినిమా ఫ్లాపైన సంగతి తెలిసిందే. టాలీవుడ్ బాలీవుడ్ లో కొన్ని పెద్ద సినిమాల్లో నటించినా కానీ నేహా శర్మ ఫేట్ మారలేదు. కాంపిటీషన్ లో ఈ భామ వెనకబడింది. నేటితరం చిల్లింగ్ గాళ్స్ రేసులో దూసుకుపోతున్నా, నేహా కేవలం మోడలింగ్ అసైన్ మెంట్స్ ఇన్ స్టా పోస్టులకు పరిమితమైంది. హేరాఫేరి 3 లో నటిస్తోందని కబురందినా కానీ ఈ సినిమా తాజా అప్ డేట్ అందలేదు.

# వీరమల్లుతో అందాల భామ.. అంతా సిద్ధం..!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ క్రిష్ కాంబోలో వస్తున్న భారీ బడ్జెట్ మూవీ హరి హర వీరమల్లు సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. సినిమాలో ఇప్పటికే నిధి అగర్వాల్ జాక్వెలిన్ లాంటి అందాల భామలు నటిస్తుండగా మరో అందాల భామ నోరా ఫతేహి కూడా భాగం అవుతుందని తెలుస్తుంది. బాహుబలి సినిమాలో ఇరుక్కుపో సాంగ్ తో పాపులర్ అయిన నోరా ఓ పక్క బాలీవుడ్ సినిమాలతో బిజీ బిజీగా ఉంటుంది. అయితే సౌత్ నుంచి ముఖ్యంగా టాలీవుడ్ నుంచి ఏ చిన్న ఛాన్స్ వచ్చినా సరే కాదనకుండా చేస్తుంది అమ్మడు. పవన్ కళ్యాణ్ హరి హర వీరమల్లు సినిమా లో కూడా నోరా ఫతేహి రిజిస్టర్ అయ్యే రోల్ లో నటిస్తుందని తెలుస్తుంది. ఈ నెల చివరన మొదలయ్యే షెడ్యూల్ లో నోరా పాల్గొంటుందని తెలుస్తుంది. ఆమెతో కీలక సన్నివేశాలు ఈ షెడ్యూల్ లో షూట్ చేస్తారని తెలుస్తుంది. వీరమల్లు సినిమాలో తన పాత్రతో మరోసారి తెలుగు ఆడియన్స్ ని అలరించనుంది నోరా ఫతేహి. వచ్చిన ప్రతి ఛాన్స్ వదలకుండా చేస్తూ వస్తుంది నోరా. అందాల భామ బాలీవుడ్ సినిమాల్లో ఎక్కువగా స్పెషల్ సాంగ్స్ లో అలరిస్తుంది. తెలుగులో కూడా అలాంటి ఛాన్స్ లే వస్తుండటంతో ఇక్కడ కూడా తన టాలెంట్ చూపిస్తుంది. ఇక వీరమల్లు లాంటి ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ లో నటించడం ఆమె కెరీర్ గ్రోత్ కి హెల్ప్ చేస్తుందని చెప్పొచ్చు. హరి హర వీరమల్లు సినిమా క్రిష్ ఎంతో అద్భుతంగా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుంది. సినిమాలో ఫ్యాన్స్ అంతా సరికొత్త పవన్ కళ్యాణ్ ని చూస్తారని తెలుస్తుంది. కీరవాణి మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమాకు మ్యూజిక్ కూడా మరో హైలెట్ అయ్యేలా జాగ్రత్త వహిస్తున్నారని తెలుస్తుంది. కొన్నాళ్లుగా షూటింగ్ వాయిదా పడుతుండగా ఈసారి పవన్ సినిమా పూర్తి చేసేందుకు పూర్తి డేట్స్ ఇచ్చినట్టు తెలుస్తుంది. ఏ.ఎం.రత్నం నిర్మిస్తున్న ఈ సినిమా పవర్ స్టార్ ఫ్యాన్స్ అందరిని మెప్పించేలా చేస్తుందని అంటున్నారు. ఈ సమ్మర్ రిలీజ్ ప్లాన్ చేస్తున్న ఈ సినిమా సమ్మర్ కి కుదరకపోతే దసరాకి వాయిదా వేసే ఛాన్స్ ఉందని టాక్.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com